

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి



# రెండు నెలల్లో అర్హులందరికీ జిఓనెం.76 పట్టాలు

**- ఆరు ప్రత్యేక బృందాలతో సర్వే ప్రారంభం**
**- అవినీతికి తావులేకుండా చర్యలు**
**- ప్రజలకు సకల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం**
**- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పట్టణ పరిధిలోని దీర్ఘకాలంగా పెడింగ్‌లో ఉన్న జిఓ నెం.76 పట్టాల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతోందని, రెండు నెలల్లో అర్హులందరికీ పట్టాలు అందజేస్తామని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం నగర పరిధిలోని 12,14,25,49 డివిజన్లలో రూ.169 లక్షలతో నిర్మించనున్న రోడ్లు డ్రైన్లు బతుకమ్మ ఘాట్ తదితర అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంఖుస్థాపన చేశారు. అలాగే 29వ డివిజన్‌ల్లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మూడో విడతలో భాగంగా జిఓనెం. 76 క్రింద పట్టణంలో 2241 దరఖాస్తులు అందాయని, అందులో 1420 దరఖాస్తులు విచారణ ఇప్పటికే పూర్తయిందని వెల్లడించారు. వీటిలో 150 పట్టాల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని చెప్పారు. మిగిలిన 821 దరఖాస్తుల పరిశీలన కోస ం ఆరుగులు తహశిల్దార్ల నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సర్వే ప్రారంభించాయని చెప్పారు. రాబోయే రెండు నెలల్లో పూర్తిస్థాయి విచారణ ముగించి ప్రతీ దరఖాస్తు దారునికి పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేదని, ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి డివిజన్ల సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు

మిగతా 2లో..






# రెండు నెలల్లో అర్హులందరికీ జిఓనెం.76 పట్టాలు

**(మొదటిపేజీ తరువాయి)** అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారామలు, కమీషనర్ సుజాత, తహశిల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్లు సుధాకర్ రాజు, బోయిన విజయ్ కుమార్, మంద నాగలక్ష్మీ, వై శంకర్, స్థానిక నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల నరేష్, గోపికృష్ణ, గుత్తుల శ్రీనివాస్, యూసుఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్రావు, భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, వాడే రాములు, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

**-వెలుగుమట్లలో ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకుని పేదలు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ దివాకర టిఎస్ ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి పనుల పురోగతిని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ నెలాఖరు నాటికి ఇండ్ల నిర్మాణంతో పాటు అంతర్గత రోడ్లు, మౌలిక సదుపాయల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ దశల వారీగా ప్రతి సోమవారం బిల్లుల మొత్తాన్ని నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఐదు లక్షల సాయంతో పాటు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కూడా కల్పించామని కలెక్టర్ తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, ఈఈ జగ్గారావు పాల్గొన్నారు.






# ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని మమత ఆసుపత్రి రోడ్డులో మెప్మా, ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నగర ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రేమ్ సాయి దివ్యాంగుల స్వయం సహాయక సంఘానికి చెందిన మాధురి అనే మహిళ ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ మురళీ, మెప్మా టిఎంసి సుజాత, సివో ద్రౌపది, ఇంజనీరింగ్ అధికారులు, పార్కు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని గొర్రెలు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వైరా రోడ్డు గోపాలపురం సమీపంలో లారీ ఢీకొని గొర్రెలు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గోపాలపురం కాలువ సమీపంలో ఖమ్మం వైపు వస్తున్న లారీ రోడ్డుపై వెళ్తున్న గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు గొర్రెలు మృతిచెందగా మూడు గొర్రెలు గాయపడ్డాయి. గొర్రెలు మృతిచెందడంతో గొర్రెల కాపర్లతో పాటు కొంత మంది స్థానికులు లారీ డ్రైవర్‌పై దాడి చేశారు. గొర్రెల కాపర్లు లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరినట్లు, దీనికి సంబంధించి గొర్రెల కాపర్లు, లారీ డ్రైవర్ ఇరువురు ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# గేదెల రుణాల జాబితాలో అవకతవకలు

**- అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సర్పంచుల వినతి**



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని వల్లాపురం, అమ్మపేట, చిరుమర్రి, మల్లన్న పాలెం, యాడవల్లి లక్ష్మీపురం, పండ్రేగుపల్లి, న్యూ లక్ష్మీపురం గ్రామాల్లో ఇందిరాక్రాంతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కార్పొరేషన్ ద్వారా అందించే గేదెల రుణాల లబ్ధిదారుల ఎంపికపై ఆయా గ్రామాల సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైన పేదలను పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల పేర్లకే జాబితాలో ప్రాధాన్యం ఇస్తున్నారంటూ వారు ఆరోపించారు. నిజమైన అర్హులను గుర్తించి, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని కోరుతూ ముదిగొండ ఎంపీడీఓ విజయకు ఆయా గ్రామాల సర్పంచులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పథకం ఉద్దేశ్యం మేరకు అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను సమగ్రంగా పరిశీలించాలని ఎంపీడీఓను కోరారు.










# సిఈసి జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించే వరకు ఉద్యమం

## -వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించి ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని లేని పక్షంలో దేశ వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు తెలిపారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీ చార్జీలను ఖండిస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎస్ ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్‌జిల్లా కార్యదర్శి జి. మనోజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ లు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థలుగా ఉండాల్సిన సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్ లను కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం జేబు సంస్థలుగా వాడుకుంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా దేశ వ్యాప్తంగా 30 రాష్ట్రాలలో 13 కోట్ల ఓట్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే తొలగించి అరెస్టు చేయాలని, సర్ ప్రక్రియను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి. రాజు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రవణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మేకల పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు త్రినాథ్, సుశాంత్, శ్రీరామ్, మనోహర్, జాని, పాషా, పిడిఎస్‌యు జిల్లా నాయకులు రాము, విశ్వంత్, సంజయ్, చందు, తిమ్మిడి రఘు, బాలు, చరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.




# పత్తి రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## -కలెక్టర్ దివాకర టివిఎస్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తిని విక్రయించే రైతులు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టివిఎస్ బుధవారం తెలిపారు. నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోళ్ల సమయంలో అన్నదాతలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని ఎనిమిది జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు తెలిపారు. పత్తిలో ఎనిమిది నుంచి 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఎనిమిది శాతానికి మించితే ప్రతి అదనపు శాతానికి క్వింటాలకు రూ. 86.67 చొప్పున కోత ఉంటుందని తెలిపారు. మార్కెట్‌కు తేచ్చే ముందు తేమ శాతాన్ని పరిక్షించుకోవాలని అందు కోసం 129 రైతు వేదికల్లో తేమ శాతం యంత్రాలను అందుబాటులో ఉంచామని రైతులు వాటి ద్వారా పరీక్షించుకోవాలని సూచించారు. కౌలు రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, విక్రయ సమయంలో ఆధార్ ధృవీకరణ తప్పనిసరి అన్నారు. రైతులు కాపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సందేహాల కోసం వాట్సాప్ నెంబర్ 8897281111, టోల్ ఫ్రీ నెం. 18005995779 ను సంప్రదించాలన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

**ప్రజాపక్షం/పెనుబల్లి:** వన్యప్రాణుల సంరక్షణ అందరూ బాధ్యతగా స్వీకరించాలని సెక్షన్ అధికారిని కవిత అన్నారు. తల్లాడ రేంజ్ అధికారిని ఉమా ఆదేశాల మేరకు ప్రాణుల సంరక్షణ వారోత్సవాలు భాగంగా మండల పరిధిలోని బ్రహ్మలకుంట ఎక్కువ టూరిజం గేటు వద్ద గిరిజనులకు అవగాహన కల్పించి నడక పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారిని కవిత మాట్లాడుతూ అడివి జంతువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై 100 బ్రాండలను కాపాడటంలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు కేశవరావు, లావణ్య, సమత, సిబ్బంది పాల్గొన్నారు.













# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి కృషి

**- ఎంఎల్ ఏ కూనంనేని**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రైతుబజార్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు భరోసా కల్పించారు. శంకుస్థాపన సందర్భంగా 29వ డివిజన్లో రైతుబజార్కు చెందినరైతులు డ్వాక్రా సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. 2021 ఏప్రిల్లో ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి తాత్కాలిక రైతు బజార్కు పంపారని, కానీ ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదని, ఎండా వానల్లో బిక్కుబిక్కుమంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. దీనిపై ఎంఎల్ఏ స్పందిస్తూ రైతు బజార్లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న 130 మంది రైతులు, 16 మంది డ్వాక్రా సంఘాల సభ్యుల దీన స్థితి తనను కలిచివేసిందన్నారు. అర్థాంతరంగా నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులను వెంటనే తిరిగి ప్రారంభించేలా సంబంధిత ఉన్నతాధికారులతో స్వయంగా మాట్లాడతామని హామీ ఇచ్చారు. అవసరమైన చర్యలు తీసుకుని మార్కెట్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తామని వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. అన్నదాతలు పేద మహిళల జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటామని, పేద వర్గా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన వెల్లడించారు. ఎంఎల్ఏ వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ వైద్యున్ని నియమించాలి

## సిపిఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష



ప్రజాపక్షం/గుండాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యకేంద్రంలో గత కొద్దినెలలుగా రెగ్యులర్ వైద్యులు లేక మండల పరిదిలోని నిరుపేద ప్రజలు అనారోగ్యంతో బాదపడుతున్నారని అధికారులకు , ప్రజాప్రథినిదుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేక పోవడంతో బుదవారం సిపిఐ,ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో వైద్య కేంద్రంముందు నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ పార్టి మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కె షాహెద్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా రెగ్యులర్ వైద్యున్ని నియమించకుండా ,రోజుకో వైద్యున్ని డిప్యుటేషన్ పద్ధతిలో పెట్టడంతో వారు 11గం. వచ్చి నాలుగు గంటలకు ఇంటి దారిపడుతుండటంతో రోగులు నాన అవస్థలకు గురౌతున్న పరిస్థితి ఇక్కడ నెలకొందని అన్నారు. వైద్యులు లేక పోవడంతో రోగులు పట్టనాలకు వెల్లాల్సిన పరిస్థి ఉందన్నారు. జిల్లా ఉన్నతాదికారులు తక్షణమే స్పందించి గిరిజన, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రెగ్యులర్ వైద్యున్ని నియ మించాలని లేని పక్షంలో ఈ దీక్షను ఇలాగే కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే మహిలా వైద్యులను కూడ నియమించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్ష కార్యక్రమంలో ఊకె సమ్మయ్య, బచ్చల రామయ్య, గడ్డం శ్రీనివాస్, ఎస్కె సాహెబ్, సమీర్, కన్నయ్య, రవిందర్, రవి వర్మ, నాసీర్, సతీష్, నారాయణ, షబ్బీర్, హరీష్, యశ్వంత్, పవన్, చంద్రయ్య, వసంతరావులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు

**గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**



ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యే గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు రతమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత గృహం లభించడం సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పినపాక నియోజకవర్గంలో పేదల సంక్షేమానికి, మౌలిక వసతుల అభివృద్ధికి, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గృహప్రవేశం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నూతన గృహాల్లో సంతోషంగా జీవించాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచించారు. సుందరయ్య నగర్లో గృహప్రవేశం చేసుకున్న తన్నీరు రత్తమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వరి తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని కొత్తూ రు గ్రామంలో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి పరిశీలించారు. ప్రస్తు తం వరి పంటలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగు లు, కంకినల్లి అధికంగా ఉన్నట్లు గుర్తించి రైతులకు నివారణ చర్యలు సూచించారు. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 30 గ్రాములు ప్లస్ కాపర్ ఆక్సీక్లోరైడ్ 200 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. తెగులు ఉన్న పొలాల్లో అధికంగా యూరియా వాడకుండా, నీరు నిల్వ లేకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కంకినల్లి నివారణకు స్పైరోమెసిఫెన్ 22.9శాతం ఎస్సీ 200 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నీలకంఠం, వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఆయా పోస్టు స్థానికులకే కేటాయించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: కాపు గంగారం గ్రామంలోని అంగన్వాడీ ఆయా పోస్టును స్థానిక అర్హులకే కేటాయించాలని గ్రామ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గత మూడు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు ఆయా పోస్టు ఎంపికలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పాదర్శకతతో ఎంపిక చేపట్టాలని కోరారు. గతంలోనూ టీచర్ పోస్టు ఎంపికలో స్థానికేతరులకు అవకాశం కల్పించారని ఆరోపించారు. ప్రస్తుతం కూడా స్థానికులను పక్కనపెట్టి ఇతర గ్రామానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేస్తే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వర్ష శ్రీరాములు, గీగ రాఘవులు, వర్ష లక్ష్మి , సోడే జయమ్మ, పొట్ట లక్ష్మి , ఊకే భద్రమ్మ, వర్ష రాజమ్మ, గీగ మంగ, మడకం భద్రమ్మ, పొడియం భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు భూములు కోల్పోయే రైతులకు మెరుగైన పరిహారం



ప్రజాపక్షం/కామేపల్లి: సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణంతో భూములు కోల్పోయే రైతులకు మెరుగైన నష్టపరిహారం అందిస్తామని ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం తెలిపారు. భూసేకరణ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కొమ్మినేపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో కొండాయిగూడెం, కొమ్మినేపల్లి రెవెన్యూ గ్రామాల రైతులతో బుధవారం నిర్వహించిన అవగాహన సభలో ఆయన మాట్లాడుతూ సుమారు రూ 2వేల కోట్లతో చేపడుతున్న సీతారామ ప్రాజెక్టుతో 10వేల ఎకరాలకు గోదావరి జలాలు అందనున్నాయని తెలిపారు. కాలువల నిర్మాణానికి సుమారు 100 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు చెప్పారు. రైతులు నష్టపోకుండా భూమి విలువకు అదనంగా మూడు రెట్లు పరిహారం, భూమిపై ఉన్న ఆస్తులకు కూడా విలువ నిర్ణయించి పరిహారం చెల్లిస్తామని తెలిపారు. రైతులు క్షేత్రస్థాయి సర్వే సమయంలో అందుబాటులో ఉండి భూముల వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, సీతారామ ప్రాజెక్టు డీఈ మోతిలాల్, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, సర్పంచ్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జున్‌రావు, జీపీఓ కందయ్య, పంచాయితీ కార్యదర్శి శంకర్, రైతులు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన కోరం



ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు కూరగాయల మార్కెట్ ప్రాంగణాన్ని ఎంఎల్ఏ కోరం కనకయ్య సందర్శించారు. వ్యాపారుల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యాపార పరిస్థితి, లాభనష్టాలపై ఆరా తీశారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషన్‌ను ఎంఎల్ఏ ఆదేశించారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు.

# నర్సాపురంలో సంయుక్త సీమంతాలు, అక్షరాభ్యాసం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: ఐసీడీఎస్ ప్రాజెక్టు నర్సాపురం సెక్టార్ పరిధిలోని నర్సాపురం 1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో సెక్టార్ స్థాయిలో సంయుక్త శ్రీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీఓ జె విజయకుమారి పాల్గొన్నారు. అనంతరం రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు సంపూర్ణ ఆహారం ఇవ్వాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు సహన సుల్తానా, కె సుశీల, అంగన్వాడీ టీచర్లు చిన్నారి, నర్సమ్మ, రమణ, పుష్పతో పాటు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ తండాలో తొలి బోర్‌వెల్ రీచార్జ్ పనులు పూర్తి



ప్రజాపక్షం/కారేపల్లి: వీబీజీ రామ్ జీ కింద చేపట్టిన బోర్‌వెల్ రీచార్జ్ పనులను భాగ్యనగర్ తండాలో తొలిసారిగా పూర్తి చేశారు. పనులను పీడీ కొండపల్లి శ్రీరామ్ పరిశీలించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ బానోత్ హీరాలాల్‌ను అభినందించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్‌లో నీటి ఎద్దడి నివారణకు రీచార్జ్ బోర్‌వెల్ పనులు ఉపయోగపడతాయని పీడీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీడీలు చలపతి, శ్రీదేవి, ఎంపీడీవో పద్మ, ఏపీవో కోటేశ్వరరావు, ఈసీ సుధీర్, పంచాయితీ కార్యదర్శి అనిల్‌కుమార్, సాంకేతిక సహాయకులు రాంబాబు, వసంత్, గుగులోత్ బాబు, రాందాస్, హేంచంద్, నంద, లకన్, గణేష్, రమేష్, రాకేష్, రాధా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై వినియోగదారుల గళం



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:పెంట్లం విద్యుత్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర స్థాయి బృందం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల వినియోగదారులు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాజపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, నామవరం గ్రామంలో వ్యవసాయ అవసరాల కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అబ్బుగూడెంలో నిలిచిపోయిన గృహజ్యోతి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అన్నపురెడ్డిపల్లిలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సరఫరాను మెరుగుపరచాలని వినియోగదారులు కోరారు. సమస్యలను విన్న అధికారులు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈ సాయి తరుణ్, లైనింగ్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, లైన్‌మెన్ సంజీవ్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార లోపంతో ఆరోగ్య సమస్యలు

**-మహిళ శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల**
**-ఘనంగా సామూహిక సీమంతాలు**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పోషకాహార లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రైతు వేదిక నందు పోషణ మాసోత్సవాల్లో భాగంగా రఘునాథపాలెం క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి చీరె సారెను అందించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, సిడిపివో వీరభద్రమ్మ, డాక్టర్ చైతన్య, దొబ్బల సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళ శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్ల వచ్చే వరకు ఉండే తొలి వెయ్యి రోజులు ఎంతో కీలకమన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల ఈ సమయంలో వేగంగా జరుగుతుందని అందుకు అనుగుణంగా సమతుల పోషకాహారం అందించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన ఐరన్ కాల్షియం, విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థాలు లభించే ఆహారాన్ని అందించాలన్నారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందిస్తున్నామన్నారు. పిల్లలకు ఇష్టమైన రీతిలో దానిని తయారు చేసి అందించే విధానంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గర్భిణీలు హిమోగ్లోబిన్ స్థాయి 10 శాతానికి పైగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో లభించే మునగాకులో ఐరన్ అధికంగా ఉంటుందన్నారు. మన అంగన్‌వాడీ మన బాధ్యత అనే లక్ష్యంతో పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారంపై ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పర్వీన్, వెంకటమ్మ, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# దసరాకు ఆర్టిసి ప్రత్యేక బస్సులు

**-ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి 1642 ప్రత్యేక బస్సు సర్వీసులు**
**-ఆర్ఎం సరిరామ్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు తమ సొంత ప్రాంతాలకు సురక్షితంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) ఖమ్మం రీజియన్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ బుధవారం తెలిపారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల మధ్య 1642 ప్రత్యేక అదనపు సర్వీసులను నడపనున్నట్లు ఆర్ఎం తెలిపారు. ఏర్పాట్లపై అన్ని డిపోల మేనేజర్లతో సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మంజిల్లాకు 909 సర్వీసులు తిరుగు ప్రయాణానికి 733 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల తొమ్మిది నుంచి 20 వరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఖమ్మం రీజియన్‌కు వచ్చే ప్రయాణికుల కోసం 630 ముందస్తు రిజర్వేషన్ బస్సులతో కలిపి మొత్తం 909 ప్రత్యేక సర్వీసులు నడపనున్నామన్నారు. పండుగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం కోసం ఈనెల 21 నుంచి 25 వరకు 405 రిజర్వేషన్ సర్వీసులతో మొత్తం 733 ప్రత్యేక బస్సులను కేటాయించామన్నారు. నిత్యం నడిచే 145 రెగ్యులర్ సర్వీసులకు ఇవి పూర్తిగా అదనమని తెలిపారు. ఖమ్మం డిపో నుంచి హైదరాబాద్‌కు 279, తిరుగు ప్రయాణానికి 216 మొత్తం 495, సత్తుపల్లి డిపో నుంచి హైదరాబాద్‌కు 172, తిరుగు ప్రయాణం 140 మొత్తం 293, మధిర డిపో నుంచి హైదరాబాద్‌కు 191, తిరుగు ప్రయాణం 102 మొత్తం 293, భద్రాచలం డిపో నుంచి హైదరాబాద్‌కు 114, తిరుగు ప్రయాణం 132 మొత్తం 246, కొత్తగూడెం డిపో నుంచి హైదరాబాద్‌కు 68, తిరుగు ప్రయాణం 57 మొత్తం 125, మణుగూరు డిపో నుంచి హైదరాబాద్‌కు 55, తిరుగు ప్రయాణం 50 మొత్తం 105, ఇల్లందు డిపో నుంచి హైదరాబాద్‌కు 30, తిరుగు ప్రయాణం 36 మొత్తం 66 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ తొమ్మిది నుంచి ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రద్దీకి అనుగుణంగా సర్వీసుల సంఖ్యను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టిసి అందిస్తున్న ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సురక్షితమైన ప్రయాణానికి ఆర్టిసి బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

# అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు

**- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**
**- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జారె**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మినీ క్రీడ మైదానం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వేదికగా మారనుంది. ఈనెల 10, 11, 12 తేదీల్లో 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్20 బాలికల జూనియర్ కబడ్డీ పోటీలు అశ్వారావుపేటలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ తెలిపారు. బుధవారం అశ్వారావుపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రతిభ కలిగిన అండర్ 20బాలికల కబడ్డీ జట్లు ఈ పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, క్రీడా మైదానం, వైద్య సదుపాయాలు, తాగునీరు తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు బాలికలకు క్రీడల్లో మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర స్థాయి పోటీలను అశ్వారావుపేటలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. ముఖ్యంగా బాలికలు క్రీడారంగంలో రాణించేలా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు అశ్వారావుపేట వేదిక కావడం ఈ ప్రాంత క్రీడా చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలిస్తుందని తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, క్రీడా కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. పోటీల సందర్భంగా క్రీడాకారిణులకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్రీడాకారిణులను ప్రోత్సహించాలని వారు కోరారు. అశ్వారావుపేట రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనుండటంతో స్థానిక క్రీడాభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే మినీ క్రీడా మైదానంలో పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారిణులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసమావేశంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.స్వాతిముత్యం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, జిల్లా కోశాధికారి కూరాకుల నరేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఏసు, కబడ్డీ కోచ్ సిహెచ్.రాంబాబు, సీనియర్ క్రీడాకారులు బి.సరీరామ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ బలోపేతంలో వెంకయ్యది కీలకపాత్ర

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తనికెళ్ల సిపిఐ బలోపేతంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆకుతోట వెంకయ్యది కీలకపాత్ర అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ సీనియర్ నాయకులు ఆకుతోట వెంకయ్య 20వ వర్ధంతి కార్యక్రమం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా యర్రా బాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, పార్టీకి ఆస్తులను కూడబెట్టటంతోపాటు గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో కృషిచేశాడని కొనియాడారు. గ్రామంలో ప్రజలమధ్య తగాదాలు గొడవలు ఏర్పడిన యెడల వాటిని పోలీస్ స్టేషన్ కు వెళ్లకుండా సున్నితంగా పరిష్కరించేవాడని అన్నారు. పార్టీని ఎన్నికల్లో గెలిపించేందుకు ఎంతో కృషిచేసేవాడని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా రిటైర్డ్ సొసైటీ రిజిస్ట్రార్ పెదమళ్ల సత్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు లేడిబోయిన గోపాల్‌రావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, గడల శ్రీనివాసరావు, పెదమళ్ల రత్తమయ్య, మేకల మల్లిఖార్జున్, గడల చిన్న సూర్యనారాయణ, లేడిబోయిన సైదులు, బెజవాడ రాంబాబు, వెంకయ్య కుమారులు ఆకుతోట మంగపతిరావు, పుల్లారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సిపిఐ నాయకురాలు మోతి మృతి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సిపిఐ నాయకురాలు వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన బానోత్ మోతి (90) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆమె మృతివార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు ఆమె భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. మోతికు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి రావెళ్ల సురేష్, మాజీ సర్పంచ్ వెంపటి కృష్ణమోహన్, గరిడి రాంబాబు నివాళులర్పించారు.

# విద్యాశాఖ అధికారికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/మధిర:** మధిర మండల విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాటూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరిని మాటూరు పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బుధవారం పాఠశాలలో సన్మానించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కొలగాని ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో శ్రీహరిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి హృదయపూర్వ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీం, చేడే సునీత, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, లావుడ్యా రవికుమార్, లాల్‌అహ్మద్, ఎం.రఘు, ఎంపిపివివి.ప్రసాద్, నాగూర్ సాహెబ్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి సర్వే



**ప్రజాపక్షం/మధిర:** మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి చేపట్టిన క్షేత్రస్థాయి సమగ్ర సర్వే కార్యక్రమంలో రెండో రోజైన బుధవారం కూడా ముమ్మరంగా కొనసాగింది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా నియమితులైన గెజిటెడ్ అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణలో మున్సిపల్ ప్రత్యేక బృందాలు వార్డుల వారీగా పర్యటిస్తూ క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయి. ఈ సర్వేలో భాగంగా అధికారులు, సిబ్బంది లబ్ధిదారుల నివాసాలకు నేరుగా వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు, ఇళ్ల స్థలాల స్థితిగతులు, ఆధార్, ఇతర ధృవీకరణ పత్రాలను పరిశీలిస్తూ వివరాలను నమోదు చేస్తున్నారు. వార్డుల్లో పరిశీలనకు వస్తున్న సర్వే బృందాలకు లబ్ధిదారులు పూర్తి వివరాలు, సంబంధిత పత్రాలు అందించి సహకరించాలని అధికారులు కోరారు.

# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు



**ప్రజాపక్షం/చింతకాని:** ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలను చేరవేయడంలో పాత్రికేయులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కొదుమూరు గ్రామంలో జరిగిన సమావేశంలో చింతకాని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు కాశిబోయిన రామారావు, పెరిక నాగేశ్వరరావులను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగానికికీలకమైన స్థానం ఉందన్నారు. ప్రజాప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని పాత్రికేయులు తమ భాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, నాయకులు కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, నాగార్జున, పెంట్యాల అప్పారావు, ఖాసీం, నెల్లూరి కోటేశ్వరరావు, యాదయ్య, బొర్రా ప్రసాద్, కందిమర్తి రామకృష్ణ, ఒర్సు వీరభద్రం, వేముల సతీష్, కంచం కోటేశ్వరరావు, పాపారావు, మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

**- ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి**
**- కలెక్టర్ అంకిత్**



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : వచ్చే ఏడాది జూన్ 26 నుండి జూలై 7వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడి ఓసిలో ఎస్‌పి రోహిత్ రాజ్‌తో కలిసి పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుష్కరాల నోడల్ అధికారిగా భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టను నియమించినట్లు తెలిపారు. ఘాట్ల వద్ద తాగునీరు మరుగుదొడ్ల స్నానాల గదులు పార్కింగ్ రహదారులు అత్యవసర నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. దుమ్ముగూడెం పర్ణశాల మోతెపట్టీనగర్ తదితర ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణకు హోల్డింగ్ ఏరియాలు, ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని ఎస్‌పి రోహిత్ సూచించారు. రహదారుల మరమ్మత్తులు పూర్తి చేసి సైన్ బోర్డులు ఎల్ఇడి డిస్‌ప్లేలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో పనిచేసి పుష్కరాల ఏర్పాట్లను నిర్దిష్ట గడువుకు ముందే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రీ-మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

**- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్**



ప్రజాపక్షం/మంచిర్యాల: సింగరేణి సంస్థలో నిర్వహిస్తున్న కార్పొరేట్ మెడికల్ బోర్డు విధానాన్ని యాజమాన్యం పునః సమీక్షించి, తీవ్ర అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించ లేని కార్మికులకు వైద్యపరమైన న్యాయం జరిగేలా రీమెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని బుధవారం ఒక ప్రకటనలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డుల్లో అన్‌ఫిట్‌గా నిర్ధారణ అవుతున్న కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. గత బోర్డుల్లో వరుసగా సుమారు 4 శాతం, 14 శాతం, 10 శాతం మాత్రమే అన్‌ఫిట్‌గా నిర్ధారణ అయిన పరిస్థితిపై యాజమాన్యం సమగ్ర సమీక్ష నిర్వహించాలని కోరారు. గుండె సంబంధిత సమస్యలతో స్టెంట్లు వేయించుకున్న వారు, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారు, శారీరకంగా కఠినమైన విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న కార్మికులు సైతం అన్‌ఫిట్‌గా నిర్ధారణ కాక పోవడం విచారకరమన్నారు. కార్మికుల వాస్తవ ఆరోగ్య పరిస్థితి, వైద్య నివేదికలు, వారు నిర్వహిస్తున్న విధుల స్వభావం, శారీరక సామర్థ్యం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నాలుగుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించిన నేపథ్యంలో అన్‌ఫిట్ కోసం ఎదురుచూస్తున్న తీవ్ర అనారోగ్యంతో ఉన్న కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేకంగా రీమెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మరోసారి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యపరంగా అర్హులైన వారిని నిబంధనల ప్రకారం అన్‌ఫిట్‌గా నిర్ధారించాలని కోరారు. మెడికల్ బోర్డు నిర్ణయాలు కేవలం హైదరాబాద్ నుంచి వచ్చే వైద్యుల అభిప్రాయాలకే పరిమితం కాకుండా, కార్మికుల వాస్తవ ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకునేలా ఉండాలని అన్నారు. ప్రస్తుతం సుమారు 1800 మంది కార్మికులు అన్‌ఫిట్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అనారోగ్య కారణాలతో సాధారణ విధులు నిర్వహించలేక అనేక మంది కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో అమలు చేసిన మెడికల్ బోర్డు విధానాలను పునఃపరిశీలించి, అర్హులైన ప్రతి కార్మికుడికి నిబంధనల ప్రకారం అన్‌ఫిట్ సర్టిఫికేషన్ లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎన్‌సిడి వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ




**- క్యాన్సర్ పై విస్తృత అవగాహన**
**- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి**

ప్రజాపక్షం/పాల్వంచ : ఎన్‌సిడి వ్యాధులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అన్నారు.ఉపవైద్య, ఆరోగ్య శాఖ పాల్వంచ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భద్రాచలం డివిజన్‌తో పాటు అశ్వారావుపేట, గుమ్మడవల్లి, దమ్ముపేట, పట్వారిగూడెం పిహెచ్‌సిల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, చికిత్స తీసుకొంటున్న రోగుల నిరంతర పర్యవేక్షణ, వ్యాధుల నియంత్రణ, క్యాన్సర్ అవగాహన, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సిడి స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ గ్రామంలో ప్రజలకు క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహ, థైరాయిడ్ తదితర వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించాలని సూచించారు. వ్యాధులు నిర్ధారణ అయిన రోగులు తీసుకొంటున్న చికిత్స, వాడుతున్న మందులు, వైద్యుల సూచనలను పాటించేలా ఎంఎల్‌హెచ్‌పిలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అదే విధంగా ప్రవేటు ఆసుపత్రులు లేదా ప్రవేటు వైద్యుల వద్ద చికిత్స పొందుతున్న ఎన్‌సిడి రోగులను సైతం గుర్తించి ప్రతి నెల ఫాలోఅప్ చేయాలన్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్స కొనసాగింపు, అవసరమైన పరీక్షలు తదితర వివరాలను నమోదు చేసి అవసరమైన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని చెప్పారు. దోమల వలన వ్యాపించే వ్యాధుల నియంత్రణ, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టి. ప్రతాప్, డిప్యూటి డిఎంహెచ్ఓ కొత్తగూడెం పిఓ సిహెచ్.దినేష్, పిఓ ఎన్‌సిడి బి. రాందాస్, పిఓ ఏఏఎం సంబంధిత ఎంఎల్‌హెచ్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## తాటి వెంకటేశ్వర్లుకు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాపక్షం/దుమ్ముగూడెం : దుమ్ముగూడెం మండలం ములకపాడు జంక్షన్‌లో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న కొమురం భీం విగ్రహ విష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అతిథిగా హాజరు కావాలని కోరుతూ కమిటీ నాయకులు బుధవారం సీతానగరంలో తెలంగాణ మాజీ ట్రైకర్ చైర్మన్, మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈకార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర్‌రావు, నాయకులు సోయం కామరాజు, అచ్యుతాపురం సర్పంచ్ కురుసం రవి, పర్ణశాల మాజీ సర్పంచ్ సిహెచ్ మిత్ర పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రజాపక్షం/చండ్రుగొండ: విద్యార్థుల భవిష్యత్తును మార్చేది చదువు ఒక్కటేనని సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి అన్నారు. అంబేద్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాయిన్ స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పుస్తకాలు, వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ ఎండి ఆసిఫ్ ఆర్థిక సహకారంతో సామగ్రి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, బూట్లు వంటి సదుపాయాలు అందుతున్నాయని రుక్మిణి తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని, క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంజా రామకృష్ణ, కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యుడు పొంగ శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్ దాసరి మణి, బదుగు కృష్ణవేణి పాల్గొన్నారు.

# పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/తల్లాడ : మండలంలోని మంగాపురం గ్రామ యూపిఎస్ పాఠశాలలో బుధవారం ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాఠశాల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ దుగ్గిదేవర నర్సింహారావు, ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. వారి వినతికి వెంటనే స్పందించిన సత్తుపల్లి నియోజక వర్గ శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ వెంటనే నిధులు మంజూరు చేయించి పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంఎల్ఏ సహకారంతో పనులు ప్రారంభం కావడం పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు గ్రామ సర్పంచ్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పరశురాం, పాఠశాల హెడ్ మాస్టర్ వెంకటరెడ్డి, వెంగన్నపేట సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లాడలో ఎంఎల్‌సీ ఎన్నికల సన్నాహక సమావేశం



ప్రజాపక్షం/తల్లాడ : ఖమ్మం నల్గొండ వరంగల్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే క్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో రెడ్డెం వీరమోహన్‌రెడ్డి స్వగృహంలో ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి తల్లాడ మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటవీరయ్య మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఇప్పటి నుంచే గ్రామ స్థాయి నుంచి పటిష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లను గుర్తించి వారి ఓటు నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ మండల పార్టీ కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు జివిఆర్, తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, తల్లాడ మండల బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి, నూతన సర్పంచ్‌లు, మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకు సేవలపై అవగాహన



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: యూనియన్ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రాప్ లోన్, గోల్డ్ లోన్, హౌస్ లోన్ తదితర రుణాలను తక్కువ వడ్డీతో పొందవచ్చని ప్రజలకు వివరించారు. ప్రైవేట్ బ్యాంకుల సేవలను వినియోగించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాల్లో ప్రతి ఒక్కరూ చేరాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ, ఏఎం హుస్సేన్, సీఎస్‌పి బి ఎల్ రాము, క్యాషియర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సమతుల్యంగా ఎరువులు వాడాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా ఎరువులను వాడాలని వ్యవసాయ శాఖ కూసుమంచి సహాయ సంచాలకులు రాజేష్ సూచించారు. మండల కేంద్రం లోని రైతు వేదిక లో బుధవారం ఇండియన్ పోటాష్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పీఎం కిసాన్ సంగోష్టి సమతుల్య ఎరువుల వినియోగం పై రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఎరువులను సరైన మోతాదులో సరైన సమయంలో సరైన పద్ధతులలో వినియోగించటం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని పంట దిగుబడి ని మెరుగుపరుచుకోవచ్చునని తెలిపారు. వేప పూత యూరియా, నానో ఎరువులు, పీడీఎం, సేంద్రియ ఎరువులను పంట అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఐపీఎల్ స్టేట్ హెడ్ సాగర్ ప్రకాష్ బోట్, మార్కెటింగ్ మేనేజర్ మురళీధరన్, ఖమ్మం సేల్స్ మేనేజర్ శైలేంద్ర, నితిన్‌రావు, ఏఈవో దాత్రి, సర్పంచ్ లు బోయిన వేణు, వల్లాల రాధాకృష్ణ, రైతు ప్రతినిధులు బచ్చలకూరి నాగరాజు, ఇరగదిండ్ల నాగరాజు, మన్నె కృష్ణారావు, మల్లెబోయిన శ్రీనివాస్ రావు,మంకెన వెంకటేశ్వరరావు, చింతనిప్పు సైదులు, కడియాల నరేష్ కోసూరి రాజాబాబు, వెన్నబోయిన కమలాకర్, కాళంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కంపగూడెం అంగన్‌వాడీలో సందడి

**-గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం**



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: ఐసీడీఎస్ ఎర్రగుంట సెక్టార్ పరిధిలోని కంపగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చండ్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్భిణీలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతాలు నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కారం శివ, ఉపాధ్యాయురాలు రాణి, అంగన్‌వాడీ టీచర్లు రాధ, సరస్వతి, శ్రీదేవి, పుష్ప, పద్మ, సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఈయు కూటమి గెలుపుతోనే ఆర్టిసి పరిరక్షణ

**-సిపిఐ నేత బాగం**
**-కూటమి గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమి గెలుపుతోనే ఆర్టిసి పరిరక్షించబడుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ పోరాట ఫలితంగానే ఆర్టిసిలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయని ఇప్పటి వరకు సాధించిన హక్కులు ఎంప్లాయీస్ యూనియన్‌తోనే సాధ్యమయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ కూటమి గెలుపు కోరుతూ బుధవారం ఖమ్మం డిపోలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుకు, స్థానిక గుర్తింపుకు కాగడ గుర్తుకు ఓటు వేయాలని హేమంతరావు కోరారు. ఆర్టిసిలో తొత్తు సంఘాలను గెలిపిస్తే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. కేవలం ఎన్నికల ముందు వచ్చి కార్మికుల గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని కాని ఆర్టిసి కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు ఏనాడైనా కార్మికుల గురించి పట్టించుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. కార్మికుల పక్షాన సమ్మెకు పిలుపునిచ్చింది ఎంప్లాయీస్ యూనియన్ నేతృత్వంలోని ఐక్య కూటమి మాత్రమేనని ఆర్టిసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వద్దకు తీసుకు పోవడంతో పాటు చివరకు ఆర్టిసిలో ఎన్నికలు జరగడానికి కూడా ఎంప్లాయీస్ యూనియన్ కూటమి కారణమని హేమంతరావు తెలిపారు. కార్మికులు తొత్తు సంఘాలకు ఓట్లు వేస్తే విలీన ప్రక్రియకు ఆటంకం ఏర్పడటమే కాకుండా ఉన్న హక్కులు కూడా హరించబడతాయని ఆయన తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా కార్మికులు బస్సు, కాగడ గుర్తుకు ఓటేసి గుర్తింపు ఎన్నికల్లో కూటమికి అఖండ మెజార్టీ సాధించిపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ గౌరవాధ్యక్షులు బిజి క్లెమెంట్, ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, ఏఐటియుసి నాయకులు శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మినారాయణ, ఎన్ఎంయు, టిఎంయు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు కావాలి

**ఓటు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ**
**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో సండ్ర**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** త్వరలో జరగనున్న ఖమ్మంనల్గొండవరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును గుర్తించి ఓటు నమోదు చేయించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. ఓటు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అని ఆయన తెలిపారు. పట్టణంలోని లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల, పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సండ్ర వెంకట వీరయ్య పార్టీ శ్రేణులకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, జర్నలిస్టులు తదితర అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి, వారిని వ్యక్తిగతంగా కలిసి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన ఓటర్లు దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామాలకు వచ్చే అవకాశం ఉన్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి ఓటు నమోదు చేయించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యే వరకు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని కొనసాగించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈసమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ బెల్లంకొండ రాము, సీనియర్ నాయకులు దొడ్డా శంకర్‌రావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమరాజు, బొడ్డు శివబాబు, షేక్ అయూబ్‌పాషా, వల్లభనేని పవన్, వెదుళ్ల నాగు, మోదుగు పుల్లారావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.7.85 కోట్లు నిధులు

**-రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భారీగా నిధులు**
**-షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.7.4కోట్లు మంజూరు: ఏఈ శ్రీమన్య**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని మున్సిపల్ ఏఈ శ్రీమన్య తెలిపారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటుకు రూ.7.85కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుందని ఆమె వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి మంజూరైన రూ.7.85 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం పనులకు దశలవారీగా ప్రారంభిస్తామని తెలిపారు.

### షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.7.04 కోట్లు

వైరా మున్సిపాలిటీ పరిధిలోని రింగు రోడ్డు వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూడా రూ.7.04 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఏఈ శ్రీమాన్య తెలిపారు. త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెరగడంతో పాటు వ్యాపారులకు కూడా సౌకర్యం కలగనుందని తెలిపారు.

### అమృత పథకంతో తాగునీటి సమస్యకు పరిష్కారం

అదేవిధంగా వైరా మున్సిపాలిటీ అమృత పథకం క్రింద రూ.26.87 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ఈ నిధులతో తాగునీటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం నీటి ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని , పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులు సుమారు 90% పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఏఈ శ్రీమాన్య వెల్లడించారు.

# ఆటో కార్మికులకు రూ.12వేలు వెంటనే అందించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మెట్ట ఆంజనేయస్వామి ఆలయ ప్రాగణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికులు ఆదాయం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఎస్‌కే షౌకత్, శ్రీను, యాకూబ్, మురళి, కృష్ణ, కేశవరావు, రాంబాబు, సత్యనారాయణ, వెంకట్ నారాయణ, రవి, కిరణ్, ప్రసాద్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో అరసం రాష్ట్ర మహాసభలు

**-అరసం బాధ్యులు వేల్పుల నారాయణ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నాల్గవ మహాసభలను నవంబర్ మాసంలో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో అరసం రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేల్పుల నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అభ్యుదయ రచనల అవసరం పెరిగిందన్నారు. ఈ సమాజాన్ని నడిపించగలిగే శక్తి , ఆలోచింపజేసే శక్తి సాహిత్యానికి ఉందన్నారు. ఖమ్మం నగరం చైతన్యానికి కాణాచిగా నిలిచిందని ఇక్కడ మహాసభలను నిర్వహించడం గొప్ప సంతృప్తిని ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లెరు వీరస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ఖమ్మంజిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రామయ్య, అంగోతు జయవాసు, అరసం నిర్మాణ సలహాదారులు జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సిఐని కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం సిఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టి. కరుణాకర్‌ను మండల బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సిఐ కరుణాకర్‌ను బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అజ్మీర వీరునాయక్, గుత్తా రవి, మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, పెంట్యా నాయక్, యాస రామారావు, మోతిలాల్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గంగరాజు తెలిపారు. బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలుగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ముదుముంతల గంగరాజు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటు హక్కుపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న ఖమ్మంజిల్లాలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండేటి వీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, మల్లవరం సర్పంచ్ కిరణ్‌కుమార్, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మలపల్లి రమేష్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణయ్య ఆశయసాధనకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/తల్లాడ :** మండలంలోని సిపిఎం కార్యాలయంలో దొడ్డా కృష్ణయ్య 33వ వర్ధంతి సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చిత్ర పటానికి సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తూ దొడ్డా కృష్ణయ్య పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం కులమత బేధాలు లేని సమ సమాజ నిర్మాణం కోసం ఆయన నిరంతరం పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, కళ్యాణ కృష్ణయ్య, నరేష్, నాగేశ్వరరావు, మస్తాన్, శ్రీనివాసరావు, భవాని, సైదులు, వెంకటనర్సయ్య, గోపాలరావు పాల్గొన్నారు.

# పమ్మి రాజుకు పిఆర్‌టియు రూ.21వేలు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వైరా:** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫొటోగ్రాఫర్ పమ్మి రాజుకు పిఆర్‌టియు వైరా మండల శాఖ రూ.21వేలు ఆర్థిక సహాయం అందించింది. మండలంలోని పిఆర్‌టియు ఉపాధ్యాయులందరి సహకారంతో సేకరించిన మొత్తాన్ని వైరా ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు చేతుల మీదుగా పమ్మి రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా కట్టా శేఖర్‌రావు మాట్లాడుతూ సామాజిక సమస్యల పరిష్కారంలోను పిఆర్‌టియు తనవంతు సహకారం అందిస్తుందని తెలిపారు. యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇది మండల శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని, పమ్మి రాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చావా శ్రీనివాసరావు పిఆర్‌టియు మండల శాఖను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెలిశెట్టి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, గాజుల భారతి, కారుమంచి దయాకర్‌రావు, పి.లత తదితరులు పాల్గొన్నారు.